క్లుప్తంగా

భద్రాచలం 'బార్' ఎన్నికలకు నామినేషన్లు



అధ్యక్ష పదవికి నామినేషన్ అందిస్తున్న దేవదానం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ సోమవారం ముగిసింది. ప్రస్తుత, మాజీ అధ్యక్షులు కోట దేవదానం, చైతన్యలు అధ్యక్ష పదవికి, తిరుమల్‌రావు, సతీష్, రమేష్ ఉపాధ్యక్ష పదవికి, శ్రీనివాసచారి, నవీన్‌కుమార్ ప్రధాన కార్యదర్శి పదవికి, శారద, తాతా లలిత సంయుక్త కార్యదర్శులుగా, పేరాల నాగరాజు, మల్లేష్, లైబ్రరీ కార్యదర్శిగా హనుమంతరావు, నాగేంద్రలు కోశాధికారిగా నామినేషన్లు దాఖలు చేశారు. వీటిని శుక్రవారం పరిశీలించనుండగా 22న ఉపసంహరణకు గడువు ఉందని, 27న పోలింగ్ నిర్వహించి అదే రోజు ఓట్లు లెక్కిస్తామని రిటర్నింగ్ అధికారి కోడాలి శ్రీనివాసన్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీమన్నారాయణ తెలిపారు. కాగా, అసోసియేషన్‌లో 101 మంది ఓటర్లుగా గుర్తింపు పొందారని వెల్లడించారు.

రేపు సామాజిక తనిఖీ

బూర్గంపాడు: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై 17వ విడత సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదిక ఈ నెల 22న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జమలారెడ్డి తెలిపారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో గత ఏడాది కాలంగా చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదికను నిర్వహిస్తున్నట్లు గురువారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ అధికారులు, ఉపాధి హామీ కూలీలు కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

ఆయుర్వేద వైద్యశిబిరం..

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీవీకాలనీ సీఈఆర్ క్లబ్‌లో సింగరేణి ఆధ్వర్యంలో 22వ తేదీ శనివారం ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఏరియా అధికార ప్రతినిధి, డీజీఎం(పర్సనల్) ఎస్.రమేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వైద్యశిబిరంలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ మాత రీసెర్చ్ ఆఫ్ ఆయుర్వేద వైద్యాలయ సీనియర్ ఆయుర్వేద డాక్టర్ విశ్వనాథ మహర్షి వైద్యసేవలు అందించనున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని సింగరేణియులు, వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

త్రీఫేస్ విద్యుత్ లైన్లకు కెపాసిటర్లు ఏర్పాటు

చండ్రుగొండ: మండలంలోని వివిధ గ్రామాల గుండా వెళ్లే త్రీఫేస్ విద్యుత్‌లైన్లకు కెపాసిటర్లను శాఖాధికారుల పర్యవేక్షణలో గురువారం ఏర్పాటు చేశారు. మండలంలోని మొత్తం ఆరు లైన్లకు కెపాసిటర్లు అమర్చినట్లు ఏడీఈ రవికకుమార్ తెలిపారు. చండ్రుగొండ, పోకలగూడెం గ్రామాల్లో 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని రావికంపాడు, బెండాలపాడు, సీతాయిగూడెం, వెంకటియాతండా, రేపల్లెవాడ, గానుగపాడు గ్రామాలకు వెళ్లే లైన్లకు కెపాసిటర్లు అమర్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఈ ఎంఎల్ నర్సింహారావు, సబ్‌ఇంజినీర్ నితిన్‌రెడ్డి, లైన్‌మెన్ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలి

భద్రాచలంటౌన్: భద్రాద్రి కేంద్రంగా ఏజెన్సీ ఆదివాసీ న్యాయ కళాశాలను ఏర్పాటు చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ అన్నారు. ఐటీడీఏ ప్రాంగణంలోని ధర్నా చౌక్‌లో న్యాయ కళాశాల ఏర్పాటు కోసం నిరసన కార్యక్రమం నిర్వహించి ఐటీడీఏ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీలో ఆదివాసీ విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లి విద్యను అభ్యసించేందుకు ఆర్థిక పరిస్థితులు సహకరించడం లేదని, మన్యంలోనే ఒక న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పాయం సన్యాసి, కారం సాయమ్మ, కారం సుజాత, కొమరం నాగమణి, తుర్రం నాగలక్ష్మి, తెల్లం రాణి తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను విస్మరించేలా బడ్జెట్

ములకలపల్లి: తెలంగాణా ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆరు గ్యారంటీలను విస్మరించేలా ఉందని సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య ఆరోపించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, ఊకంటి రవికుమార్, పొడియం వెంకటేశ్వర్లు, మాలోతు రావూజా, నిమ్మల మధు, మంచాల సారయ్య, గుగులోతు రవీందర్, కీసరి వెంకట్రావు, బుగ్గా వెంకటనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

- ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు
- బందోబస్తుకు సంసిద్ధంగా పోలీసులు

మణుగూరుటౌన్: ఎస్సెస్సీ వార్షిక పరీక్షలు శుక్రవారం నుంచి జరగనుండగా మండలంలో ఏర్పాట్లు పూర్తిచేశామని మణుగూరు ఎంఈఓ స్వర్ణలత తెలిపారు. మండలంలో పరీక్షలు రాయనున్న 856 మంది విద్యార్థుల కోసం ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు బిగించడంతో పాటు తాగునీటి సౌకర్యం కల్పించామని.. విద్యార్థులు అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

బూర్గంపాడు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, వీటిల్లో 665 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు విద్యాశాఖ అధికారి యదుసింహరాజు తెలిపారు. కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశామని, పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

ములకలపల్లి: పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ సత్యనారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని మొత్తం 249 మంది విద్యార్థులు మండల కేంద్రంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నట్లు, అక్కడ తగిన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు సకాలంలో సెంటర్లకు రావాలని సూచించారు.

అశ్వాపురం: మండలంలో శుక్రవారం నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంఈఓ వీరస్వామి తెలిపారు. మండలంలోని పరీక్షా కేంద్రాలను గురువారం ఆయన సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. అశ్వాపురంలో 120 మంది, మల్లెలమడుగులో 110 మంది పరీక్షలు రాయనున్నట్టు ఆయన తెలిపారు.



చండ్రుగొండ: సెయింట్ జోసఫ్ పాఠశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ సత్యనారాయణ

చండ్రుగొండ: నేటి నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు ఏర్పాటు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణ తెలిపారు. గురువారం ఆయన మండలకేంద్రం చండ్రుగొండలో ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. మొత్తం 275 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. అన్నపురెడ్డిపల్లిలోనూ పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఓ ఉండేటి ఆనంద్‌కుమార్ తెలిపారు. ఎర్రంగుట పరీక్ష కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. మొత్తం 303 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు చెప్పారు.

అశ్వారావుపేటరూరల్: నేటి నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానుండగా.. ఆయా పరీక్ష కేంద్రాల్లో విద్యాశాఖ అధికారులు గురువారం ఏర్పాట్లు పూర్తి చేశారు. అశ్వారావుపేట మండలంలోని పరీక్ష కేంద్రాల్లో మొత్తం 596 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. గురువారం ఏర్పాట్లను ఎంఈఓ పొన్నగంటి ప్రసాద్‌రావు, ఎస్సై యయాతి రాజులు సందర్శించి పరిశీలించారు.



అశ్వాపురం: పరీక్ష కేంద్రాల సిబ్బందితో సమావేశమైన ఎంఈఓ వీరస్వామి



కరకగూడెం: పరీక్ష కేంద్రం వద్ద ఎంఈఓ మంజుల, ఎస్సై రాజేందర్

కరకగూడెం: నేటి నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కరకగూడెం జెడ్పీ పాఠశాల పరీక్ష కేంద్రంలో 5 పాఠశాలలకు చెందిన 129 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. గురువారం కరకగూడెం ఎంఈఓ మంజుల, ఎస్సై రాజేందర్ సదరు పరీక్ష కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో సీఎస్ రామిరెడ్డి, డీఓ రాంగోపాల్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మణుగూరుటౌన్: మండలంలోని పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 39 మందికి రూ.39,04,524 విలువైన చెక్కులను అందించామన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచేలా తమ ప్రభుత్వం పాటుపడుతోందని తెలిపారు. అలాగే, మండలానికి చెందిన పలువురికి రూ.11,38,000 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఆతర్వాత మండలంలోని ముత్యాలమ్మనగర్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు ప్రారంభించారు. రూ.50లక్షలతో 9 సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు స్వర్ణజ్యోతి, జయలక్ష్మి, మధుకర్, ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు పీరినాకి నవీన్, శివ, కుచిపూడి బాబు, తరుణ్‌రెడ్డి, ఐతనబోయిన సతీష్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు

ముత్యాలమ్మ ఆలయంలో పూజలు..

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలోని శ్రీ ముత్యాలమ్మ అమ్మవారిని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కుటుంబసమేతంగా గురువారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకుడు లంకా శ్రీనివాస్‌రావు మర్యాదపూర్వకంగా శాలువాతో కప్పి సన్మానించారు. బైరెడ్డి సతీష్, డల్లి వేణు, కర్రి రవీందర్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు మద్ది కుమారి పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

దుమ్ముగూడెం: వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులకు అసౌకర్యం కలుగకుండా విధులు నిర్వహించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చైతన్య సూచించారు. గురువారం నరసాపురం పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. డెలివరీలు, గర్భిణులకు అందుతున్న సేవల గురించి, జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కుష్ఠు వ్యాధి కేసుల గుర్తింపు సర్వే కార్యక్రమం పురోగతిని అడిగి తెలుసుకున్నారు. క్షయ వ్యాధి గల వారికి జరుగుతున్న న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమం పురోగతి తెలుసుకున్నారు అనంతరం మాట్లాడుతూ.. స్టాఫ్ అందరూ సమయపాలన పాటించాలని రోగుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. పీహెచ్‌సీలో అవసరమైన పరికరాలు, రిపేర్ల వివరాలు తీసుకుని అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. డాక్టర్ సుభాష్, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చైతన్య

లోఓల్టేజీ లేకుండా చర్యలు

దుమ్ముగూడెం: మండలంలోని గ్రామాల్లో లోఓల్టేజీ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని డీఈ జీవన్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని తూరుభాక, రామకృష్ణ పురం, నరసాపురం, సీతారామపురం, రేగుబల్లి గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లోని లోఓల్టేజీ లేకుండా సరిపడేంత లోడ్‌ను అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈ ప్రభాకర్ రావు, ఏఈ మోహనరెడ్డి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న డీఈ జీవన్‌కుమార్

ఏఐటీయూసీ ఆధ్వర్యాన పోరాటం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరీ రంగయ్య

మణుగూరురూరల్: సింగరేణి సంస్థ, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం పోరాడే ఎర్రజెండా యూనియన్ ఏఐటీయూసీ అని ఆ యూనియన్ రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరి మిర్యాల రంగయ్య అన్నారు. గురువారం ఏరియాలోని కేసిహెచ్‌పీలో జరిగిన ఫిట్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సింగరేణి ఓసిలలో బొగ్గు వెలికితీసే ప్రక్రియను ప్రైవేట్ టెండర్లకు అప్పజెప్పొద్దని, సింగరేణి కార్మికులతోటే తీయించాలని డిమాండ్ చేశారు. కోయగూడెం, సత్తుపల్లి బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు చెల్లించాల్సిన 33వేల కోట్లను వెంటనే చెల్లించాలని, కార్మికుల సొంతింటి కోసం 250 గజాల స్థలం కేటాయించి రూ.30లక్షల వడ్డీలేని రుణం ఇవ్వాలని కోరారు. అనంతరం కేసీహెచ్‌పీ డీజీఎం వి.మధన్‌నాయక్‌ను కలిసి సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్, ఉపాధ్యక్షుడు ఎంవి.రాంనర్సయ్య, అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి మేకల ఈశ్వరరావు, పుల్లారావు, ఆవుల నాగరాజు, గంగాధర్‌రావు, కుమారస్వామి, రాజశేఖర్, సందీప్, వెంకటేశ్వర్లు, శివకృష్ణ, నాగభూషణం, కార్తీక్, విజయ్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమాలపై విచారణ జరపాలి

చర్ల: ఇసుక ర్యాంపుల్లో జరుగుతున్న అక్రమాలపై ప్రభుత్వం సీబీ సీఐడీతో విచారణ నిర్వహించాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో గురువారం చర్లలో తహసీల్దార్ ఎం.శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి పాలెం చుక్కయ్య, డివిజన్ నాయకుడు సాయన్న మాట్లాడారు. ఇసుక ర్యాంపుల్లో రైజింగ్ కాంట్రాక్టర్ వ్యవస్థను రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇక్కడ మాత్రం రైజింగ్ కాంట్రాక్టర్లే పెత్తనం చెలాయిస్తున్నారని ఆరోపించారు. తద్వారా గిరిజన సొసైటీలను మోసం చేయడంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని అన్నారు. ఇక్కడ 2.50 లక్షల క్యూబిక్ మీటర్లకు అనుమతి ఇస్తే 6 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తీశారని, ఆపై దొడ్డిదారిన పట్టణాలకు తరలిస్తున్నారని తెలిపారు. అధికారులు పట్టీనట్లు వ్యవహరిస్తున్న తీరును విమర్శించారు. వెంటనే ఇసుక తీసిన ప్రాంతాన్ని సందర్శించి విచారణ జరపకపోతే ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పాలెం నాగరాజు, కల్లూరి కృష్ణ, సిమిడి సుజాత, చింతకాయల సరళ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

వీరభద్రరావు నియామకం హర్షణీయం

మణుగూరుటౌన్: బీసీ లైజనింగ్ అధికారిగా వీరభద్రరావును నియమించడంపై టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకట్ హర్షం వ్యక్తం చేశారు. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా కార్మికుల పట్ల గౌరవ మర్యాదలు కలిగిన అధికారి వీరభద్రరావు అని కొనియడారు. టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో వీరభద్రరావును సన్మానించి స్వీటు తినిపించారు.

విద్యా రంగానికి తీరని అన్యాయం

అశ్వారావుపేటరూరల్: బడ్జెట్‌లో విద్యారంగానికి నిధుల కేటాయింపులో తీరని అన్యాయం జరిగిందని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వరక అజిత్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. విద్యారంగానికి కేవలం రూ.23,108 కోట్ల నిధులు కేటాయించడం సరికాదని, విద్యార్థి లోకానికి అన్యాయమేనని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.

నిత్యావసరాల పంపిణీ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని వృద్ధులకు, దివ్యాంగులకు తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం, యశోద పరివర్తన ఫౌండేషన్ సేవ సమితి ఆధ్వర్యంలో గురువారం నిత్యవసర వస్తువులను పంపిణీ చేశారు. పట్టణంలోని పేద వృద్ధులు, వికలాంగులకు బియ్యం, కందిపప్పు, కూరగాయలను అందజేశారు. సంఘం అధ్యక్షుడు భూషణ్ రావు, గోళ్ల భూపతి రావు, సుబ్బరాజు, తుల సీదాస్, సత్యనారాయణ, మేకల లత, మణికుమారి, అప్పణదాసు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి మనుగడపై అసెంబ్లీలో చర్చించండి

మణుగూరుటౌన్: సింగరేణి పరిధిలోని మణుగూరు ఏరియా మనుగడతో పాటు నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ, కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపు అంశాలపై అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చర్చించాలని ఇఫ్టూ నాయకులు కోరారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఎమ్మెల్యే శాసనసభ్యుడు కూనంనేని సాంబశివ రావు, ఎమ్మెల్సీ కోదండరామ్‌కు హైదరాబాద్‌లో వినతిపత్రాలు అందజేశారు. ఈమేరకు గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.డీ.నాజర్‌పాషా మాట్లాడగా పలువురు నాయకులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణలో అన్యాయం'



మణుగూరురూరల్: నిరసనలో పాల్గొన్న నాయకులు

మణుగూరురూరల్: ఎస్సీ వర్గీకరణలో కాంగ్రెస్ ప్రభుత్వం మాలలకు అన్యాయం చేసిందని మాల మహానాడు మండల అధ్యక్షుడు వేర్పుల నరేష్ విమర్శించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణ బిల్లుకు వ్యతిరేకంగా గురువారం నిరసన తెలపగా ఆయన మాట్లాడారు. 2011 నాటి జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవడంతో మాలలకు అన్యాయం జరిగిందని, తెలంగాణ ఏర్పడ్డాక మాదిగలు అభివృద్ధి చెందిన విషయాన్ని పట్టించుకోకపోవడం సరికాదన్నారు. మాల మహానాడు మండల ప్రధాన కార్యదర్శి బూర్గుల సతీష్, నాయకులు వేర్పుల సురేష్, దాసరి వెంకట్, బూర్గుల సంజీవరావు, ముల్క నరేష్, వేమూరి రవి, పప్పుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చండ్రుగొండ: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మాలలు తగిన గుణపాఠం చెప్తారని మాల మహానాడు జిల్లా నాయకుడు రాయి రాజా అన్నారు. గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించిన తీరు అభ్యంతరకరమన్నారు. షమీంఅక్తర్ ఏకసభ్య కమిషన్ చేసిన సిఫార్సులు ఏమిటో బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు ఇల్లంగి బాలకృష్ణ, బేతి నాగరాజు, లక్ష్మణ్, క్రాంతి, నరేందర్, రాజు. దాసరి సతీష్, బడుగు సీతారాములు, బేతి వంశీకృష్ణ పాల్గొన్నారు.

సంక్షేమానికి నిధులు పెంచాలి

దుమ్ముగూడెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025–26 బడ్జెట్‌ను పునఃసమీక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం వైఎస్ భవన్‌లో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీకృష్ణ అధ్యక్షత జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బడ్జెట్‌లో విద్య, వైద్యం, గృహ నిర్మాణం, వ్యవసాయ రంగానికి నిధులు పెంచాలని కోరారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రామారావుపేట గ్రామానికి చెందిన వర్ష చైతన్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. తల్లిదండ్రులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు యలమంచి రవికుమార్, మండల కార్యదర్శి కారం పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు మర్మం చంద్రయ్య, కొరసా చిలకమ్మ, శ్రీనుబాబు, బొల్లి సత్యనారాయణ, కొమరం చంటి,కాక కృష్ణ, సమ్మక్క, శిలువ కుమార్,సరియం ప్రసాద్, సోయం పార్వతి, అపకా రంగయ్య, రాంబాబు, ఉబ్బ చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దూలుగొండ, గోవిందరాజు జాతర



దూలగొండ దేవతకు ఎదురెళ్లిన ఆదివాసీ భక్తులు

గుండాల: ఈసం వంశీయుల ఆరాధ్య దైవం, దూలుగొండ దేవత గురువారం గద్దెనెక్కడంతో నిండు జాతర మొదలైంది. మండలంలోని రోళ్లగడ్డ గ్రామంలో ఈ జాతర అంగరంగ వైభవంగా జరిగుతోంది. బుధవారం మండల మెలుగుట, గుడి మెలుగుట నిర్వహించారు. గురువారం అమ్మవారిని గద్దెలపై ప్రతిష్ఠించారు. తలపతులు, వడ్డెలు ప్రత్యేక పూజలు చేశారు. దేవున్ని తీసుకువచ్చే క్రమంలో భక్తులు డోలి చప్పుల్లతో నృత్యాలు చేశారు. మహిళలు పూనకాలతో ఊగిపోయారు. భక్తులు భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు.

గోవిందరాజు..

మరోవైపు చెట్టుపల్లి గ్రామానికి చెందిన సనప వంశీయల ఇలవేల్పు గోవిందరాజును గద్దెపై ప్రతిష్ఠించడంతో నిండుజాతర ప్రారంభమైంది. గురువారం జాతర అంగరంగవైభవంగా గిరిజన సాంప్రదాయాలతో, ప్రత్యేక పూజలతో జాతర నిర్వహించారు. దేవుడిని గద్దెలపై ప్రతిష్ఠించిన తర్వాత కల్యాణ మొక్కులు చెల్లించుకున్నారు. గోవిందరాజును చెట్టుపల్లిలో పురవీధుల వెంట డోలీ చప్పుళ్లతో, నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు.

బీసీ రిజర్వేషన్ పెంచడంపై హర్షం

దుమ్ముగూడెం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి బీసీ రిజర్వేషన్ 21 శాతం నుంచి 42 పెంచటం, ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో తీర్మానం చేయడంపై మండల కాంగ్రెస్ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. గురువారం లక్ష్మీనగరంలోని ఎమ్మెల్యే క్యాంపులో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ నాయకులు లంకా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, భట్టీ విక్రమార్కలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, కాంగ్రెస్ నాయకులు కుంజా శ్రీనివాసరావు, కెల్లా శేఖర్, దర్శి సాంబశివ రావు, మట్టా శివాజీ, గద్దం బాలాజీ, తెల్లం హరికృష్ణ, తెల్లం భీమరాజు,పిలక వెంకటరమణారెడ్డి, కోడి చంటి, నరేంద్ర, శివ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

దమ్మపేట: మండలంలోని మొద్దులగూడెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి గురువారం పాలాభిషేకం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గకరణను ఆమోదించి, బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ తీసుకున్న నిర్ణయం పట్ల మొద్దులగూడెం కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ, సీఎం, మంత్రుల చిత్రటాలకు పాలాభిషేకం నిర్వహించారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు దొడ్డా భాస్కరరావు మాట్లాడుతూ.. వర్గీకరణ, రిజర్వేషన్ల పెంపు రెండు కూడా సాహసోపేతమైన నిర్ణయాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామ శాఖ కాంగ్రెస్ అధ్యక్షుడు మోరంపూడి వెంకటేశ్వరరావు, దొడ్డా భాస్కరరావు, ముళ్లపూడి వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, వాడపల్లి రాజు, బుద్దేటి మంగరావు, బాల శ్రీధర్, కర్లపూడి బాలానందం తదితరులు పాల్గొన్నారు.



దమ్మపేట: సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలి

అశ్వారావుపేటరూరల్: ప్రతీ విద్యార్థిలో పోటీతత్వం ఉండాలని, పాఠశాలల్లో నిర్వహించే పోటీల్లో భాగం కావాలని స్థానిక ఎంఈఓ పొన్నగంటి ప్రసాద్‌రావు అన్నారు. గురువారం మండల పరిధిలోని ఊట్లపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల వద్ద పలు ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు తెలుగు, సైన్స్, సోషల్, గణితం సబ్జెక్ట్‌ల్లో క్విజ్ పోటీలు, గణితంలో స్థాయి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వీటిలో క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతిను ఆసుపాక యూపీఎస్, ద్వితీయ బహుమతిను నందిపాడు యూపీఎస్ విద్యార్థులకు, కన్సోలేషన్ కింద తిరుమలకుంట యూపీఎస్ విద్యార్థులు సాధించారు. అలాగే గణితంలో ప్రథమ బహుమతిని తిరుమలకుంట యూపీఎస్, ద్వితీయ బహుమతి నందిపాడు యూపీఎస్, కన్సోలేషన్ కింద ఆసుపాక యూపీఎస్ విద్యార్థులు పొందారు. విజేతలకు నగదు, జ్ఞాపికలు, జీకే బుక్స్‌ను ఎంఈఓ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు వీరేశ్వరరావు, ఆర్.పద్మావతి, కిషిందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణారావు, కె.హరినాథ్‌బాబు, రవికుమార్, లక్ష్మీనర్సు, విజయలక్ష్మి, బాలాజీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లో ఉన్న శ్రీషిరిడి సాయి బాబా ఆలయంలో గురువారం మణుగూరుకు చెందిన ఆకుల లక్ష్మి, కుమారుడు సంపత్‌కుమార్, కుమార్తె సలికలు సాయిబాబాను దర్శించుకుని ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.